09-07-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 03 | సంచిక : 46 | పేజీలు : 8 | వెల : 5
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి

## బ్రెజిల్‌లో ప్రధాని మోదీ పర్యటన..

- 144 గుర్రాలతో అపూర్వ స్వాగతం..



బ్రెజిల్ అధ్యక్షుడు పిలుపు మేరకు ఆ దేశ పర్యటనకు వెళ్లిన భారత ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం బ్రెజిలియా రాజధాని నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తమ దేశానికి వచ్చిన ప్రధాని మోదీకి 114 గుర్రాల ఊరేగింపుతో ఘన స్వాగతం పలికారు. జూలై 6 నుండి 7 వరకు రియో డి జనీరోలో జరిగిన 17వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం తర్వాత, అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా డ సిల్వా ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ బ్రెజిల్‌ను సందర్శిస్తున్నారు. భారతదేశం,బ్రెజిల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింతగా పెంచుకోవడానికి, బ్రిక్స్ ఫ్రేమ్‌వర్క్ కింద బహుపాక్షిక సహకారాన్ని పెంపొందించడానికి ఈ పర్యటన కొత్త ప్రోత్సాహాన్ని సూచిస్తుందని

...మిగతాది 2 లో

## కూకట్‌పల్లిలో తీవ్ర విషాదం



కల్తీ కల్లు తాగి 11 మందికి అస్వస్థత, ఒకరి పరిస్థితి విషమం!

హైదరాబాద్‌లో తీవ్ర విషాదం వెలుగు చూసింది. కూకట్‌పల్లిలోని హైదర్ నగర్‌లో కల్లు తాగిన పలువురు అస్వస్థతకు గురయ్యారు. స్థానికంగా ఉన్న ఓ కల్లు దుకాణంలో మంగళవారం కల్లు తాగిన 11 మంది తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే అందుకొ ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం.

...మిగతాది 2 లో

## చెరువులను సందర్శించిన కర్ణాటక ఇంజినీర్ల బృందం

- హైడ్రా అన్ని రాష్ట్రాలకూ అవసరమంటూ సూచన



నగరంలో హైడ్రా పనితీరును బెంగళూరు లేక్స్ డిపార్ట్మెంట్ ఇంజినీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. చెరువుల పరిరక్షణ,పునరుద్ధరణ, అభివృద్ధిని క్షేత్ర స్థాయిలో వీక్షించింది. పాతబస్తీలో బమృక్నుద్దౌలా చెరువుతో పాటు.. అంబర్పేటలోని బతుకమ్మకుంటను సందర్శించింది. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టక ముందు, తాజా పరిస్థితులను గమనించింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగించిన తీరును తెలుసుకుంది. నీటి జాడ లేని చెరువులను అభివృద్ధి చేసిన తీరును అభినందించింది. వరదల నివారణకు చెరువుల ప్రాధాన్యత ఎంతో ఉందని వివరించింది. చెరువులను అనుసంధానం చేసే నాలాలను కూడా పరిరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని అభిప్రాయ పడింది. ఇందుకు హైడ్రా చేపట్టిన చర్యలను పరిశీలించింది.

...మిగతాది 2 లో




# తెలంగాణలో ఏం జరిగింది?

- రైతును రాజు చేసిందెవరో తేల్చేద్దాం దమ్ముంటే కేసీఆరో.. కేటీఆరో చర్చకు రావాలని CM సవాల్ విసిరాడు!
- నాకు సబ్జెక్ట్ వుంది సత్తా వుందని సవాల్ ని స్వీకరించి సమాధానం చెప్పడానికి ప్రెస్ క్లబ్ వచ్చిండు KTR!
- సవాల్ విసిరిన CM మాత్రం రానే రాలేదు !
- సవాల్ విసిరి తప్పించుకున్నవెందుకు?
- సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్
- సీఎం రాకుంటే మంత్రులు వచ్చినా చర్చకు సిద్ధం
- ఇప్పుడు కాకుంటే ఇంకెప్పుడైనా రెడీ
- అసెంబ్లీకైనా వస్తం..కానీ మైక్ కట్ చేయద్దు
- ముఖ్యమంత్రి ఒప్పుకొంటే ఆయన చాలెంజ్‌ను స్వీకరిస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జయభేరి, హైదరాబాద్, జూలై 8 :

'సీఎం రేవంత్‌రెడ్డి..రైతు సమస్యలపై చర్చిద్దాం రమ్మంటే తొక ముడిచి తప్పించుకొని ఢిల్లీకి పారిపోయినవెందుకు? అయినా సవాల్ విసరడం.. బురదజల్లడం.. పారిపోవడం నీకు మొదటి నుంచి అలవాటే, నువ్వు రాకుంటే నీ మంత్రినైనా పంపు చర్చకు సిద్ధం..' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. మంగళవారం రైతు సమస్యలపై చర్చించేందుకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వెళ్లే ముందు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు.ముఖ్య మంత్రి ముచ్చటపడితే తాను చర్చకు సిద్ధమయ్యాయని కేటీఆర్ స్పష్టం చేశారు. గతంలో ఎన్నోసార్లు సవాల్ విసిరి తప్పించుకుపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 'కొడంగల్‌లో ఒడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ చేసి ఆరు నెలలు తిరగకముందే మల్కాజిగిరిలో ఎంపీగా పోటీ చేస్తివి..హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంట అంటివి..అందుకే నువ్వు మాట మీద నిలబడే మనిషిని కాదు కాబట్టే నీ కొరిక మేరకు కొడంగల్‌లోనైనా, కొండారెడ్డిపల్లిలోనైనా, నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్లోనైనా..అంబేద్కర్ చౌరస్తాలోనైనా, చివరికి అసెంబ్లీలోనైనా చర్చకు సిద్ధమని చెప్పినం.. కాదుపోదూ అంటే తటస్థ వేదిక అయినా ప్రెస్‌క్లబ్‌కు మేమే వస్తమని చెప్పినం.. జూలై 8న 11 గంటలకు రమ్మని అడిగినం.. వ్వు తప్పించుకపోతవని తెలుసు.. నీకు బేషజాలు తప్పా బేసిన్ల గురించి తెలియదని మూడు రోజుల టైమిచ్చినం.. అంటూ దెప్పిపొడిచారు. రేవంత్ సవాల్‌ను స్వీకరించి మొన్ననే ప్రెస్‌క్లబ్‌ను బుక్ చేశామని తెలిపారు. ఈ రోజూ సీఎం విసిరిన సవాల్‌ను స్వీకరించి కొడంగల్‌లో రైతుబంధు అందని 670 మంది రైతుల జాబితాతో సహా, రుణమాఫీ కానీ రైతుల వివరాలు, రానీ బోనస్, రైతు శ్రేయస్సుకు సంబంధించిన ప్రతి అంశంపై విస్తారంగా చర్చించేందుకు మా నాయకత్వం మొత్తం రైతు సమస్యలపై అధికారికంగా సమాచారం తీసుకొని ఈ రోజు ప్రెస్‌క్లబ్‌కు వెళ్తున్నామని స్పష్టం చేశారు.

**మంత్రులతోనైనా చర్చకు రెడీ..**

ముచ్చటపడి పిలిచిన ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉన్నారని తెలిసిందన్నారు. ఒకవేళ ఆయన రాని పరిస్థితుల్లో ఉప ముఖ్యమంత్రో, వ్యవసాయ శాఖ మంత్రో, బాధ్యాతాయుతమైన మరో మంత్రి వస్తరని అనుకుంటున్నామన్నారు. అందుకే సోమాజిగూడ ప్రెస్క్లబ్‌కు బయల్దేరి వెళ్తున్నారన్నారు. 'మా కేం భేషజం లేదు.. ముఖ్యమంత్రే రావాలని లేదు.. ఆయన తరుపున ఉప ముఖ్యమంత్రి వచ్చినా, ఇంకో మంత్రి వచ్చినా వారితో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నం.. చర్చించి వివరాలన్నీ అందజేస్తాం' అని స్పష్టం చేశారు. రైతుల సబ్జెక్టే కాదు.. తెలంగాణ యువత, అశోక్‌నగర్‌లో చాయ్ అడ్డామీద

...మిగతాది 2 లో

## మహిళలకు అద్దిరిపోయే శుభవార్త




- ఉచిత బస్సు ప్రయాణంపై సీఎం చంద్రబాబు సంచలన ప్రకటన..

జయభేరి, విజయవాడ, జూలై 8 :

ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు చంద్రబాబు పేర్కొన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మహిళలు ప్రయాణించవచ్చో.. కూడా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫుల్ క్లారిటీ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు

...మిగతాది 2 లో



## రైతుల కన్నీరు తుడవండి

- నడ్డాకు ముఖ్యమంత్రి రేవంత్ వినతి

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రానికి అవసరమైన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జె.పి. నడ్డాను కోరారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో జరిగిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ విజ్ఞప్తి చేశారు.

**యూరియా సరఫరాలో జాప్యం:**

వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని సీఎం నడ్డా దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు చేరి, సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని కోరారు.

**"రైల్వే రేకుల కొరతపై సీఎం ఆందోళన:**

జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నుల దేశీయ యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే అందినట్లు సీఎం వివరించారు. యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యూరియా సరఫరాకు రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని, వాటి సంఖ్య పెంచాలని కోరారు.

బీజేపీ టార్గెట్ సాత్ | 2 | శ్రీశైలం గేట్లు ఎత్తివేత..

మొదటిపేజీ తరువాయి

## తెలంగాణలో ఏం జరిగింది?

రాహుల్‌గాంధీతో చెప్పించిన 2 లక్షల ఉద్యోగాలపై గానీ, ఆడబిడ్డలకు ఇస్తానన్న నెలకు రూ. 2500 హామీలపై తాము చర్చించేందుకు సిద్ధమా అని ముఖ్యమంత్రి అన్నారు..ఆయన చెప్పినట్లు ఆ అంశాలపై చర్చించేందుకు సిద్ధమేనని తేల్చిచెప్పారు.

**ఈ రోజు కాకుంటే ఇంకే రోజైనా..**

ముఖ్యమంత్రి మాటమీద నిలబడి చర్చకు వస్తే మంచిదన్నారు. ఒకవేళ ఈ రోజు వీలుకాకుంటే మరోరోజైనా తాము వచ్చేందుకు రెడీగా ఉన్నామని కుండబద్దలు కొట్టారు. మీరు చెప్పిన సమయం, తేదీ నాడే రెడీగా ఉంటామని స్పష్టం చేశారు. ఏనాడు చర్చకు వచ్చినా రైతులకు కాంగ్రెస్ చేసిన మోసాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉన్నామని, మరోసారి సవాల్ విసురుతున్నామని పేర్కొన్నారు.

**అసెంబ్లీలోనైనా చర్చిద్దాం..**

మేం ప్రజల సమక్షంలో తటస్థ వేదికపై చర్చిద్దామంటున్నామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఒకవేళ అసెంబ్లీలో చర్చ చేసేందుకు కూడా సిద్ధమేనని చెప్పారు. కానీ గతంలో ఫార్మాసిటీ, ఫార్మర్స్ సమస్యలు లేవనెత్తిన సందర్భాల్లో అధికారపక్షం తమ మైక్ కట్ చేయించదని, సీనియర్లు, మాజీ మంత్రులు మాట్లాడినా ఆరేడుసార్లు మైక్ కట్ చేసిన ఉదంతాలు ఉన్నాయని ఉదహరించారు. అయితే అసెంబ్లీలో చర్చించేందుకు ప్రభుత్వం ఏనాడు సుముఖంగా లేదన్నారు. గతంలో ఫార్ములాఈపై, ఫార్మర్స్ సమస్యలపై, ఫార్మాసిటీపై చర్చకు తాము ప్రతిపాదిస్తే తప్పించుకొన్నదని దుయ్యబట్టారు. అందుకే స్పీకర్‌ను ఇబ్బంది పెట్టవద్దని ఉద్దేశ్యంతో ప్రెస్‌క్లబ్‌లో చర్చించేందుకు సిద్ధమయ్యామని చెప్పారు. అయితే ఇప్పుడు అసెంబ్లీలో చర్చపెట్టి మైక్ కట్ చేయకుండా మాట్లాడే సమయం ఇస్తే, ముఖ్యమంత్రి మాటిస్తే చర్చించేందుకు రెడీగా ఉన్నాం..అయితే తమ ప్రతిపాదనలకు ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు.

**చేతగాకుంటే తప్పుకొని కేసీఆర్‌కు అప్పజెప్పు..**

అసెంబ్లీ సమావేశాలు నిర్వహించమని స్పీకర్‌కు కేసీఆర్ లేఖ రాయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరడం వింతగా ఉన్నదని ఎద్దేవా చేశారు. 'మరీ కేసీఆరే అసెంబ్లీ పెట్టమని, కేసీఆరే ముందు చెప్పాలని, అన్ని నిర్ణయాలు ఆయననే చేయమంటే సీఎంగా రేవంత్‌రెడ్డి ఎందుకు? మీరు కదా ఆరు గ్యారెంటీలు, 420 హామీలిచ్చింది.. అమలు చేయాల్సిన బాధ్యతమీపైలేదా? అని ప్రశ్నించారు. ఒక వేళ పాలన చేయడానికి చేతగాకుంటే తప్పుకొని కేసీఆర్‌కు అప్పగిస్తే అప్పుడు ఏం జేయాలో అది చేసి చూపెడతామని స్పష్టం.

## కూకట్‌పల్లిలో తీవ్ర విషాదం

డబ్బుల కోసం కొందరు వ్యాపారులు ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. పౌడర్, కెమికల్స్‌తో తయారు చేసిన కల్లును దుకాణాల్లో విక్రయిస్తున్న ప్రజల శరీరాల్లో విషాన్ని నింపుతున్నారు. రాష్ట్రంలో ఎక్సైజ్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్న కల్తీ కల్లు మాఫియాలో మాత్రం ఎటువంటి మార్పు ఉండట్లేదు. దుకాణాల్లో విచ్చలవిడిగా కల్తీ దందాను కొనసాగిస్తూనే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌లో మరోసారి కల్తీ కల్లు వ్యవహారం వెలుగు చూసింది. కూకట్‌పల్లి పీఎస్ పరిధిలోని హైదర్‌నగర్‌లో కల్తీ కల్లు తాగి 11 మంది అస్వస్థతకు గురయ్యారు. కల్లు తాగిన వారు కాసేపటికే వాంతులు, విరేచనాలు, తీవ్ర కడుపునొప్పితో ఇబ్బంది పడ్డారు. దీంతో వారిని వెంటనే స్థానిక హాస్పిటల్‌కు తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఇందులో ఒక పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉన్నట్టు సమాచారం. కల్తీ కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైనట్టు సదరు హాస్పిటల్ సిబ్బంది జీహెచ్‌ఎంసీ, ఎంహెచ్‌వోకు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే, అరికెపూడి గాంధీ, బీఆర్ ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బాధితులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కల్తీ కల్లు తయారీదారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో కూకట్‌పల్లి పోలీసులు బాధితులను నుంచి వివరాలు సేకరించారు.

## బ్రెజిల్‌లో ప్రధాని మోదీ పర్యటన..

అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ దేశ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో, ఉరుగ్వే నాయకులతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వాణిజ్యం, డిజిటల్ చెల్లింపులు, సాంప్రదాయ వైద్యం, స్థిరమైన అభివృద్ధితో సహా విస్తృత శ్రేణి రంగాలపై వారితో ప్రధాని మోదీ చర్చించారు. ఆయుర్వేదం, విపత్తు సంసిద్ధత, యూపీఐ పేమెంట్స్ టెక్నాలజీ , సామర్థ్య నిర్మాణంలో సహకారాన్ని విస్తరించాలని ఇరువురు నాయకుల మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్టు విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ రంగాలు రెండు అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థల మధ్య సమ్మిళిత అభివృద్ధి, సాంకేతిక సహకారం కోసం ఉమ్మడి దృక్పథాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

**చారిత్రాత్మక సందర్శన..**

1968 తర్వాత మొదటిసారిగా ఒక భారత ప్రధాన మంత్రి బ్రెజిల్‌కు ద్వైపాక్షిక రాష్ట్ర పర్యటన చేపట్టారు. ప్రధాని మోదీ హాజరు భారతదేశంబ్రెజిల్ సంబంధాలను బలోపేతం చేయడమే కాకుండా, లాటిన్ అమెరికా అంతటా వ్యూహాత్మక భాగస్వామ్యాలను పెంపొందించడంలో భారతదేశం యొక్క నిబద్ధతను కూడా ఉట్టిపడుతుంది. ఈ పర్యటన రెండు ప్రజాస్వామ్య దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడి, సాంస్కృతిక మార్పిడిలో విస్తృత సహకారానికి మార్గం సుగమం చేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

## కర్ణాటక ఇంజినీర్ల బృందం

అంబర్పేటలో ముల్లపొదలతో, పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పేసిన చెరువును పునరుద్ధరించిన తీరు ఆసక్తిగా ఉందని ఇంజినీర్లు అన్నారు. ఆక్రమణలను తొలగించినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయో వాకబు చేశారు. బతుకమ్మ కుంట అని పేరు ఎందుకు వచ్చింది. మరి ఆ చెరువు ఎలా పూడ్చివేశారు ఇలా అనేక విషయాలను తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో చెరువు పునరుద్ధరణ, అభివృద్ధిని చూసి ముచ్చట పడ్డారు. వనమూలికల మెక్కలు, చెట్ల కొమ్మలు వేసిన ఈ చెరువు దిగువున ఊట బావి నీటిని నిజాం నవాబులు తాగునీటిగా వినియోగించిన చరిత్రను తెలుసుకుని ముచ్చట పడ్డారు. ఇలాంటి చరిత్ర ఉన్న చెరువులను పునరుద్ధరించిన హైడ్రాకు అభినందనలు తెలిపారు.

చెరువుల సందర్శన అనంతరం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీర్ హరిదాసు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిత్య, భూప్రద, మహదేవ్లతో పాటు ఆ రాష్ట్ర ప్రతినిధులు హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్గారితో బేటీ అయ్యారు. హైడ్రా గురించి విన్నాం.. పత్రికల్లో చదివాం.. ఇక్కడ ప్రత్యక్షంగా చూస్తున్నాం. నగరంలో పూర్తిగా కనుమరుగైన, కాలుష్యం భారిన పడిన చెరువులను అభివృద్ధి చేస్తున్న తీరు బాగుందన్నారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణలతోపాటు.. ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించడం కత్తిమీద సాములాంటిదని.. అనతి కాలంలోనే చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ అంటే ఏంటో ప్రజలు తెలుసుకునేలా చేశారంటూ ప్రశంసించారు. హైడ్రా వంటి సంస్థ అన్ని రాష్ట్రాలకూ అవసరమని అన్నారు. బెంగళూరులో చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. 2006 నుంచి చెరువుల హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ వేయడం ద్వారా కబ్జా కాకుండా చూస్తున్నామన్నారు. కాలువలు కబ్జాకు గురి అవ్వడంతోనే వరదలు వస్తున్నాయని..బెంగళూరులో చెరువులను హైడ్రా కమిషనర్ సందర్శించినప్పటి చిత్రాలతో కూడిన ఫొటో ఫ్రేంను శ్రీ రంగనాథ్గారికి ఇంజినీర్ల బృందం అందించారు.

## మహిళలకు అద్దిరిపోయే శుభవార్త

చంద్రబాబు పేర్కొన్నారు. ఎక్కడి నుంచి ఎక్కడి వరకు మహిళలు ప్రయాణించవచ్చో.. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా టీడీపీ - బీజేపీ - జనసేన కూటమి అధికారంలోకి వస్తే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఇస్తామని హామీనిచ్చింది. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్డీఏ సర్కార్ ఈ స్కీమ్‌పై కసరత్తు చేస్తూ వస్తోంది.. మహిళలకు ఉచిత బస్సు పథకాలను అమలు చేస్తోన్న కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఏపీ మంత్రులు, అధికారులు పర్యటించి ఇప్పటికే పూర్తి వివరాలు సేకరించారు.. వచ్చే నెలలో ఉచిత బస్సు పథకాన్ని క్షేత్ర స్థాయిలో అమల్లోకి తీసుకువచ్చేందుకు సన్నాహాలను ప్రారంభించింది. కాగా.. మంగళవారం శ్రీశైలంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు.. సున్నిపెంటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై క్లారిటీ ఇచ్చారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ ఆగస్టు 15వ తేదీ నుంచి ఫ్రీ బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తామని చెప్పారు.. ఏ జిల్లాకు చెందిన మహిళలు ఆ జిల్లా వరకే ఉచితంగా ప్రయాణం చేయవచ్చని స్పష్టంచేశారు. జిల్లాలో ఎక్కడ తిరగాలన్నా ఆడబిడ్డలు ఫ్రీగా ప్రయాణం చేయొచ్చని.. ఒక్కరూపాయి కూడా అవసరం లేదని స్పష్టంచేశారు.

# బీజేపీ టార్గెట్ సౌత్

**రానున్న అసెంబ్లీ ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధమవుతున్నది. పార్టీ జాతీయ అధ్యక్షుని ఎన్నికకు ఇంకా సమ యం పట్టవచ్చు. ఆ ఎన్నికలో జరుగుతున్న జాప్యం అటుంచితే, ఇటీవలే ఆరు రాష్ట్రాలకు పార్టీ కొత్త అధ్యక్షులను నియమించింది. కనుక ఎన్నికల ప్రక్రియలో భాగంగా జేపీ నడ్డా వారసుని ఎంపిక కొద్ది వారా ల్లో ము గియవచ్చు. నిజానికి పొడిగించిన ఆయన పదవీకాలం కూడా ముగిసి నెలలైంది. పార్టీ నియమావళి ప్రకారం దేశంలోని సగం రాష్ట్రా ల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తయితే గానీ, జాతీయ అధ్యక్షుని ఎన్నికకు మార్గం సుగమం కాదు.**



ఇప్పుడు ఆరు రాష్ట్రాలకు కొత్త అధ్యక్షులను నియమించుకోవడంతో ఇక జాతీయ అధ్యక్షుని ఎన్నిక ఒక్కటే మిగిలివుంది. రాష్ట్రాల చీఫ్‌లు నాయకులను ఎంపిక చేయడంలో వారికి సం స్థాగతంగా ఉన్న అనుభవాన్ని అధిష్ఠానం పరిగణలోకి తీసుకున్నట్టు స్పష్టమైంది.నడ్డాకు వారసుణ్ణి ఎంపిక చేయడంలో పార్టీకి, ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే ఆలస్యానికి కారణమనే ఊహాగానాలు వినిపించాయి. సంఘ్ పరివార్‌తో ఏకాభిప్రాయం కుదిరిన వెంటనే జాతీయ కమల దళపతి పేరు ప్రకటించే అవకాశం ఉంది. బీహార్, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల అసెంబ్లీలకు కొద్ది నెలల్లో ఎన్నికలు జరుగనున్నాయి. కీలకమైన ఈ రాష్ట్రాల్లో బీజేపీకి విజయం అందించడం పార్టీ కొత్త అధ్యక్షుడికి సవాల్ కానున్న దిదక్షిణాన తమిళనాడు, తెలంగాణపై దృష్టి నిలిపిన బీజేపీ తన వ్యూ హాల అస్త్రాలను ఇప్పటికే బయటకు తీసింది. తమిళనాడులో అన్నాడీఎంకేతో పొత్తుపెట్టుకున్న బీజేపీ, కొత్త పార్టీతో ముందుకెళ్తున్న తమిళ పాపులర్ నటుడు విజయ్‌పై కన్నేసింది. అయితే, బీజేపీతోగానీ, డీఎంకేతో గానీ తమిళ వెట్రి కళగం (టీవీకే) పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని, వచ్చే ఏడాది రాష్ట్ర అసెంబ్లీకి జరుగనున్న ఎన్నికల్లో తనే ముఖ్యమంత్రి అభ్యర్థినని విజయ్ ప్రకటించుకున్నారు.పార్టీ కార్యనిర్వాహక కమిటీ ఈమేరకు తీర్మానం కూడా ఆమోదించింది. ఈ పరిస్థితుల్లో అధికార డీఎంకేను ఎదుర్కోవడంలో అన్నా డీఎంకేతో కలిసి బీజేపీ ఎలాంటి వ్యూహం అనుసరిస్తుం దనేది చూడాలి. మరోవైపు, బలవంతంగానే అన్నా డీఎంకేను బీజేపీ పొత్తుకు ఒప్పించిందన్న ఊహాగానాల మధ్య, ఇదీ నిజమేనన్న తీరులో పళనిస్వామి మాటలు వినిపిస్తున్నాయి. బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నా, సీట్ల పంపకం మొదలు ఏ విషయంలోనైనా అన్నాడీఎంకే పెద్దన్న పాత్రలో ఉంటుందని పళనిస్వామి చెపుతున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో, ముఖ్యంగా మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటకల్లో హిందీ భాష పట్ల వ్యక్తమవుతున్న వ్యతిరేకత తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనున్నది. ఈ పరిస్థితి దృష్టిలో పెట్టుకుని బీజేపీని పూర్తిగా తలెత్తుకోవడం అన్నాడీఎంకెకు ఇబ్బందిగా వుంది. తమిళనాడు అసెంబ్లీ సీట్ల పంపకం చెరిసగంగా ఉండాలని కేంద్ర మంత్రి అమిత్‌షా ఇప్పటికే పళనిస్వామికి ఖరాఖండికి చెప్పినట్టు వార్తలు వచ్చాయి. ఇక తెలంగాణలో గత అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలనే సాధించిన బీజేపీ, కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావు నాయకత్వంలో అధికార పీఠం చేజిక్కించుకునే వైపునకు కదులుతున్నది.రానున్న ఏడాది కాలంలో బిహార్, అస్సాం, తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో మెజారిటీ రాష్ట్రాల్లో గెలవడం బీజేపీకి ఒక అగ్నిపరీక్ష లాంటిది. ముఖ్యంగా దక్షిణాదిన బీజేపీ విస్తరించడం అంత సులభం కాదుఅయితే కేవలం సంఘ్ అండదండలు ఉన్నంత మాత్రాన బీజేపీ విజయాలు సాధించగలుగుతుందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. నిజానికి సంఘ్ బలంగా ఉండడం వేరు, బీజేపీ బలంగా ఉండడం వేరు అన్న విషయం రెండు సంస్థలకూ తెలియనిది కాదు సంఘ్ అత్యంత బలంగా ఉన్న కర్ణాటకను ఒకప్పుడు బీజేపీ దక్షిణాది ద్వారంగా ఆ పార్టీ నేతలు అభివర్ణించారు. కాని క్రమంగా ఆ ద్వారం మూసుకుపోతున్నట్లు కనపడుతోంది. దేశమంతటా హిందుత్వ ప్రయోగం విజయవంతం అవుతున్నట్లు కనపడుతున్నప్పటికీ కర్ణాటకలో మాత్రం ఈ ప్రయోగం లింగాయత్‌ల అదుపులో ఉన్నట్లు స్పష్టమవుతోంది. అక్కడ పార్టీలో ఉన్న అంతర్గత పోరాటాన్ని అధిష్ఠానం అరికట్టలేకపోతోంది. నేతలు ఒకరిపై మరొకరు మీడియాకెక్కుతున్నారు. యడ్యూరప్పను, ఆయన కుమారుడు విజయేంద్రను మచ్చిక చేసుకునేందుకు ఇటీవల బలమైన ఎమ్మెల్యేను బసనగౌడ పాటిల్ యత్నాల్‌ను పార్టీ నుంచే బహిష్కరించారు. బీజేపీకి కర్ణాటకలో భవిష్యత్ లేదని త్వరలో ఒక కొత్త రాజకీయ పార్టీని స్థాపిస్తానని యత్నాల్ ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను అప్రతిష్ఠపాలు చేసేందుకు ముడా కుంభకోణాన్ని లేవనెత్తి, ఈడీని ప్రయోగించినా బీజేపీ విజయవంతం కాలేకపోయింది. విచిత్రమేమంటే సంఘ్ హేమాహేమీలు దత్తాత్రేయ హోసబలె, సిఆర్ ముకుంద్, ప్రస్తుతం జాతీయ స్థాయిలో సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా ఉన్న సంతోష్, హెచ్‌వి శేషాద్రి, పద్మనాభాచార్య తదితరులు ఆ రాష్ట్రానికి చెందినవారే. ఒకప్పటి సర్ సంఘ్ చాలక్ సుదర్శన్ కూడా మైసూరుకు చెందినవారే. నిజానికి మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అగ్రశ్రేణి సంఘ్ నేతలు కర్ణాటక నుంచే వచ్చారు. కాని అదే కర్ణాటకలో ఇప్పుడు బీజేపీ రాజకీయ భవిష్యత్తు డోలాయమాన పరిస్థితిలో ఉన్నది. సంతోష్‌జీ వల్లే దక్షిణాదిలో బీజేపీ దెబ్బతిన్నదని విమర్శలు చేసేవారు కూడా ఉన్నారు. తమిళనాడులో ఐపీఎస్ అధికారి అన్నామలైను ప్రవేశపెట్టి ఓట్ బ్యాంకును పెంచుకునేందుకు బీజేపీ చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో మళ్లీ అన్నాడీఎంకెపై ఆధారపడవలసిన స్థితి ఏర్పడింది. కేరళలో కూడా ఆర్ఎస్ఎస్ బలంగా ఉన్నా బీజేపీ కొంత ఓటుశాతాన్ని పెంచుకోవడం తప్ప అసాధారణమైన విజయాలేమీ సాధించలేదు.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే నెల్లూరులో ఆర్ఎస్ఎస్ తొలి శాఖ 1947లోనే ఏర్పడింది. 1948లో విజయవాడలో ఆర్ఎస్ఎస్ అతి పెద్ద సభను నిర్వహించింది. 1950లలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన తొలి ఓటీసీ నెల్లూరులో జరిగింది. మహారాష్ట్ర నుంచి వచ్చిన దేశ్‌పాండే, బాపురావు మోఘే, బంది షే, గోపాల్‌రావు టాగోర్‌తో పాటు కరెడ్ల సత్యనారాయణ, భండారు సదాశివరావు, సోమెపల్లి సోమయ్య లాంటి వారు సంఘ్‌ను ఏపీలో నిర్మించారు. గుంటూరులో శాఖకు హాజరైన వారిలో మాజీ ముఖ్యమంత్రులు ఎన్టీరామారావు, భవనం వెంకటరామ్, సీనియర్ జర్నలిస్టు పొత్తూరి వేంకటేశ్వరరావు లాంటి వారున్నారని ఒక ఆర్ఎస్ఎస్ నేత తన ఆత్మకథలో రాశారు. నిజానికి హైదరాబాద్ స్టేట్‌లో ఆర్యసమాజ్ మూలంగా ఆర్ఎస్ఎస్‌కు అనుకూల వాతావరణం ఉండేది. 1947లోనే గోల్వాల్కర్ హైదరాబాద్‌కు రహస్యంగా వచ్చారు. 1949లో శ్రీరాంసాథే ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలను ప్రారంభించారు. నృపతుంగ, కేశవ మెమోరియల్ లాంటి విద్యాసంస్థలను సంఘ్ అభిమానులను ప్రారంభించారు. నక్సల్బరీ ఉద్యమానికి పోటీగా 1967లోనే ఏబీవీపి ఏర్పడింది. తొలి ఏబీవీపి విద్యార్థి సదస్సు 1967 జూలైలో జరిగింది. 1968లో అఖిల భారత ఏబీవీపి సదస్సు జరిగినప్పుడు సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత క్రమేణా ఏబీవీపీ తెలంగాణలోని అనేక కాలేజీల్లో బలపడింది. అయినప్పటికీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రత్యామ్నాయ భావజాలం బలంగా ఉండడం వల్ల జనసంఘ్ ఉనికి ఏర్పర్చుకోలేకపోయింది. తర్వాతికాలంలో తెలుగుదేశం బలమైన ప్రాంతీయ పార్టీగా ఏర్పడడంతో బీజేపీ నిలదొక్కుకోలేకపోయింది. రాజకీయాల్లో ప్రత్యర్థులను బలహీనపరచడంవల్లనో, భావోద్వేగాలను సృష్టించడంవల్లనో లభించే విజయాలు ఎప్పటికైనా తాత్కాలికమవుతాయి. మనను నడిపిస్తున్న లక్ష్యాలేమిటి? రాజకీయాల్లో మనం ఎందుకు ప్రవేశించాం, ఆదర్శాలు, విశ్వాసాల కన్నా వ్యక్తులకు మనం ప్రాధాన్యత కల్పిస్తున్నామా అన్న ప్రశ్నలు వేసుకుని ముందుకు సాగకపోతే విజయాలు వైఫల్యాలుగా మారేందుకు ఎంతో కాలం పట్టదు. కాంగ్రెస్ అదే పరిస్థితిని ఎదుర్కొన్న విషయం తెలియనిది కాదు.





# శ్రీశైలం గేట్లు ఎత్తివేత..

## కృష్ణమ్మ సవ్వడి చూస్తే మైమరిచిపోవాల్సిందే..

- కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో. శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారింది.. ఈ క్రమంలో. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. మంగళవారం సీఎం చంద్రబాబు శ్రీశైలంలో పర్యటించారు.. ఈ సందర్భంగా డ్యాం గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు.

జయభేరి, శ్రీశైలం :

కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతుండటంతో.. శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారింది.. ఈ క్రమంలో.. కృష్ణమ్మకు జలహారతి ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీరు విడుదల చేశారు. మంగళవారం శ్రీశైలంలో పర్యటించిన సీఎం చంద్రబాబు..నిండుకుండలా మారిన శ్రీశైలం ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. 6,7,8, 11 మొత్తం నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రతో పాటు ఎగువ పరీవాహక ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షాలు పడుతుండటంతో కృష్ణానది ఉరకలేస్తోంది. ఆలమట్టి, నారాయణ్ పూర్ ప్రాజెక్టులు కూడా గరిష్ఠనీటి మట్టానికి చేరుకున్నాయి. దీంతో ఇవాళ ప్రాజెక్టు గేట్లు ఎత్తారు. శ్రీశైలానికి ఎగువ నుంచి లక్షా 62వేల 529 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోందని అధికారులు చెబుతున్నారు.

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు.. హెలికాప్టర్ నుంచి శ్రీశైలం ప్రాజెక్ట్ ను, నదీ ప్రవాహాలను, పరివాహక ప్రాంతాన్ని పరిశీలించారు.. ఎరియల్ వ్యూ ద్వారా అన్ని ప్రాంతాలను పరిశీలించారు.

ఇటు నాగార్జున సాగర్‌కు కూడా వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. ఈసారి నెలరోజుల ముందుగానే సాగర్‌కు వరద పోటెత్తింది. ఇక శ్రీశైలం గేట్లు కూడా ఎత్తేయడంతో నెలరోజుల్లో పూర్తిస్థాయి నీటిమట్టానికి సాగర్ చేరుకుంటుందని అధికారులు తెలిపారు. గత ఏడాది ఆగస్టులో ఎత్తిన సాగర్ గేట్లు... ఈసారి జూలై చివరిలోనే ఎత్తే అవకాశం ఉందంటున్నారు. మరోవైపు శ్రీశైలం గేట్లు ఎత్తడం వల్ల ప్లంజ్‌పూజ్‌కు ఇప్పటికిప్పుడే ఎలాంటి ప్రమాదం లేదంటున్నారు నిపుణులు..

# నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ లో ఉప్పల్ డీసీ ఆంజనేయులు గారితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. దేవేందర్ నగర్ కాలనీలో నెలకొన్న ప్రధాన సమస్య డ్రైనేజీ వ్యవస్థ, స్ట్రీట్ లైట్ అలాగే కమ్యూనిటీ హాల్ నిర్మాణం వాటర్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తా అని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ కన్నయ్య, BRS పార్టీ సీనియర్ మహిళా నాయకురాలు ఎక్కటి పద్మా రెడ్డి, జాంగిర్ బి, జీనత్ బేగం, జయ రెడ్డి, మమతా రెడ్డి, కనీస్ ఫాతిమా, నాయకులు పిల్లి నాగరాజు, మధుసూదన్ రెడ్డి, కుమారస్వామి,, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.







## వెకేషన్ లో విషాదం

**జయభేరి, హైదరాబాద్, జూలై 8:**

అమెరికాకు వెకేషన్ కోసం వెళ్లిన హైదరాబాద్ కు చెందిన ఓ కుటుంబం దుర్మరణం చెందింది. మినీ ట్రక్కు వీరి కారును ఢీకొట్టింది. మంటలు చెలరేగడంతో కుటుంబం మొత్తం సజీవ దహనం అయింది. అప్పటివరకూ ఎంతో సంతోషంగా ఉన్న ఆ కుటుంబం నిమిషాల వ్యవధిలో ఊహించని ప్రమాదంతో బూడిదగా మారింది. దేశం కాని దేశంలో విహారయాత్రకు వెళ్లిన కుటుంబం కనీసం బంధువులు చివరిచూపు సైతం నోచుకోలేని విధంగా నలుగురు మంటల్లో కాలి బూడిద కావడం కలచివేస్తోంది. హైదరాబాద్ కు చెందిన తేజస్విని, శ్రీ వెంకట్ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి అమెరికాకు వెకేషన్ కు వెళ్లారు. సుచిత్రలో నివాసం ఉండే ఈ ఫ్యామిలీ డల్లాస్ వెళ్లింది. సెలవులు ఉండటంతో అట్లాంటలోని తమ బంధువుల ఇంటికి కారులో వెళ్లారు. వారం రోజుల పాటు అట్లాంటలో ఉండి, తిరిగి వస్తుండగా దురదృష్టవశాత్తూ రోడ్డు ప్రమాదం జరిగింది. అట్లాంట నుంచి అర్ధరాత్రి డల్లాస్ కు శ్రీవెంకట్ కుటుంబం తిరుగు ప్రయాణం అయింది. కానీ గ్రీన్ కౌంటీ ఏరియాలో రాంగ్ రూట్ లో వచ్చిన ఓ మినీ ట్రక్కు వీరు ప్రయాణిస్తున్న కారును వేగంగా ఢీకొట్టింది. ఫ్యూయల్ ట్యాంక్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో మంటలు కారు మొత్తం వ్యాపించడంతో అందులో ఉన్న నలుగురు సజీవ దహనం కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. కార్ మొత్తం బూడిద కావడంతో వారి ఎముకలను ఫోరెన్సిక్ కు పంపారు. డీఎన్ఏ శాంపిల్స్ సేకరించిన తరువాత పోలీసులు ఆ మృతదేహాలను అప్పగించనున్నారు. వెకేషన్ కు వెళ్లిన వారు ప్రమాదం జరిగి పిల్లలతో సహా సజీవదహనం కావడంపై వెంకట్, తేజస్విని కుటుంబ సభ్యుల ఆందోళన చెందుతున్నారు.

## కన్నవారిని చంపుతామంటున్న కొడుకు

**జయభేరి, జగిత్యాల:**

మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన సురకంటి భూమ రెడ్డి,లక్ష్మీ అనే వృద్ధ తల్లిదండ్రులను కొడుకు లింగారెడ్డి,కోడలు పుష్పలత, మనుమడు రంజిత్ లు చంపుతామని బెదిరింపులకు గురిచేస్తున్నారని మంగళవారం జిల్లా ఎస్పీకి,సీనియర్ సిటీజెన్స్ అసోసియేషన్ జిల్లా సంఘానికి ఫిర్యాదు చేశారు.ఆ వినతిపత్రాల్లో తమ పేరు మీదున్న భూములను వారి పేరు మీద మార్చాలని,రైతు బంధు డబ్బులు వారికే ఇవ్వాలని తరచుగా కొట్టుతూ,చంపుతామని బెదిరింపులు చేస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వీరి ఫిర్యాదు మేరకు కోరుట్ల ఆర్డీవో కార్యాలయంలో వృద్ధుల సంరక్షణ కింద కేసు దాఖలు చేశామని ,వేధింపులు మానక పోతే 3 మాసాల జైలు శిక్షతో పాటు జరిమానాకు వారు చట్ట ప్రకారం గురువుతారని సీనియర్ సిటీజేన్స్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,కౌన్సెలింగ్ అధికారి పి.సి.హన్మంత రెడ్డి లు పేర్కొన్నారు.

## జ్యోతిర్మయికి తెలంగాణ తల్లి ఐకాన్ అవార్డు

- అవార్డు అందజేసిన దాసరి రజినీ

**జయభేరి, కోరుట్ల:**

జగిత్యాల జిల్లాకు చెందిన పిన్నంశెట్టి జ్యోతిర్మయి తెలంగాణ తల్లి ఐకాన్ అవార్డు అందుకున్నారని సావిత్రిభాయ్ పూలే ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు దాసరి రజినీ తెలిపారు. జిల్లాలోని కోరుట్ల పట్టణంలోని నారాయణ పాఠశాల ప్రాధానోపాధ్యాయురాలు జ్యోతిర్మయి విధులు నిర్వహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న దృష్ట్యా ఈ అవార్డుకు సావిత్రిభాయ్ పూలే ఫౌండేషన్ ఎంపిక చేయగా సోమవారం అవార్డు అందేజేశామని రజినీ తెలిపారు.

## బాంబు బెదిరింపుల కలకలం

**జయభేరి, హైదరాబాద్:**

హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్లు బెదిరింపులు రావడం కలకలం రేపుతోంది. రాజ్భవన్, పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టు, జింఖానా క్లబ్, సికింద్రాబాద్ సివిల్ కోర్టుల్లో బాంబ్ పెట్టినట్లు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఈమెయిల్ పంపించాడు. దీంతో పోలీస్ యంత్రాగం అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్తో తనిఖీలు చేపట్టారు.

# లీడరే.. కాదండోయ్.. మంచి ఫార్మర్..

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం...
- రైతు బాగుంటే దేశం బాగుంటుంది.
- సాధారణ రైతులా మారిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం..
- జేయభేరి ప్రతినిధి కదారి శ్రీనివాస్ సీనియర్ జర్నలిస్ట్ కెమెరాకు ఇలా చిక్కారు...!

**జయభేరి, నకిరేకల్ :**



నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల వీరేశం వ్యవసాయ దారుడుగా మారిపోయారు. నిజానికి నాయకుడిగా ప్రజల్లో మంచి పేరు ప్రఖ్యాతలు పొందుకుంటూ ఖాళీ సమయంలో తన పొలం పనులు చేసుకుంటూ ఏం చక్క సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. తన వ్యవసాయ క్షేత్రంలో వరి నాటు వేయడానికి ఓరి నారును పొలంలో పనిచేసే పనికి శ్రీకారం చుట్టి రైతుగా మారిపోయారు... తాను ఎమ్మెల్యేను అని చూడకుండా అందరి వాడినే అంటూ పేద ధనిక కులం మతం అనేవి చూడకుండా కూలీలతో సమానంగా దుక్కి దున్ని నారు మోసి తన పొలంలో తానేవ్యవసాయదారుడుగా మారిపోయారు.. స్వయంగా నారు కట్టి కూలీలకు పంచి దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్నగా మారిపోయారు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం. ఆర్భాటాలకు అంగులకు తాను ఎప్పుడు దూరంగా ఉంటున్న ఇలా జయభేరి ప్రతినిధి కెమెరాకు చిక్కారు.



# యనమల రాజుకు అరుదైన గౌరవం

- బెస్ట్ రీ సేల్ రియల్టీ అవార్డ్ తో సత్కారం

**జయభేరి, హైదరాబాద్ :**




నగరానికి చెందిన యనమల రాజుకు అరుదైన గౌరవం లభించింది. ఎలాంటి విద్యార్హత, కుల, మత, ప్రాంత, లింగ బేధం లేకుండా వందలాది మంది నిరుద్యోగులు, గృహిణులు, చిరు ఉద్యోగులు, వ్యాపారంలో నష్టపోయిన వారికి అండగా నిలవడంతో పాటు, తీవ్రమైన అప్పుల బాధలో ఉండి చావే శరణ్యమనుకున్న ఐదొందల మంది నిరాశ్రయుల్ని లక్షాధికారుల్ని చేసినందుకు గానూ ఆయన్ను.. బెస్ట్ రీ సేల్ రియల్టీ అవార్డు వరించింది. హైదరాబాద్ అమీర్పేట్ లోని ఆదిత్య కన్వేషన్ సెంటర్లో బిజ్ నెట్ వర్క్, రియల్టీ సిండికేట్ వారు నిర్వహించిన ఈ కార్యక్రమంలో యనమల రాజుకు ఈ అవార్డును ర్యక్రమంలో బిజ్ నెట్ వర్క్ సిఈఓ నారాయణ స్వామి, రియల్ ఎస్టేట్ సిండికేట్ ప్రతినిధులు తమ్మిశెట్టి సుధాకర్ తదితరులు అందజేశారు.. యనమల డెవలపర్స్ కంపెనీ ద్వారా... భూముల రేట్లు పెరగడం, ప్రమోషన్, మార్కెటింగ్, కంపెనీ లాభలు తదితర వాటి వల్ల... కొత్త ప్లాట్ల రేట్లు కస్టమర్లకు భారంగా మారిన నేపథ్యంలో... పాత ప్లాట్లనే రీ సేల్ చేస్తున్నారు. దీని వల్ల...షాద్ నగర్ లాంటి చోట 6 లక్ష్యాలకే ఆడబిడ్డ కు ప్లాట్ ఇస్తూ, కొనిపించడమే కాదు... అవసరమైతే అమ్మించడం కూడా మా బాధ్యత అంటూ, మార్కెట్ రేట్ కంటే 30% తక్కుకు ఇస్తూ.. ఏడాది వ్యవధిలోనే 500 పైగా రీ సేల్ ప్లాట్లు విక్రయించారు..ఈ నేపథ్యంలోనే ఓ వైపు ఉద్యోగం లేక ఇబ్బంది పడుతున్న నిరుద్యోగ యువతకు ఉపాధిమార్గం చూపిస్తున్నారు.. ఆయన స్థిరాస్తి రంగంలో పొదుపు, ఇన్వెస్ట్మెంట్, ట్రేడింగ్ ప్రాపర్టీ, మార్కెటింగ్, సేల్స్ మెలుకువలు , పెట్టుబడియేతర బిజినెస్ తదితర అంశాలపై ఆర్టికల్స్ రాస్తూ, ఆయా ఛానెల్స్ లో ఇంటర్వ్యూస్ ఇస్తూ.. ఎందరినో చైతన్య పర్చారు , రియల్ ఎస్టేట్ ఫ్రీలాంచ్, స్కీమ్ మోసాలు, లాభాలు, డాక్యుమేంటేషన్ తదితర.. ఏ రంగం, ఏ ప్రాంతం, ఏటైంలో ఇన్వెస్ట్ చేస్తే బాగుంటుందో ఇన్వెస్టర్లకు అవగాహన కల్పిస్తున్నారు.





## హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొలుసు దొంగతనం

**జయభేరి, హయత్ నగర్ :**

హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గొలుసు దొంగతనం సంఘటన జరిగింది. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం సాయంత్రం 7:00 గంటలకు, పసుల నర్సమ్మ(65), నర్సయ్య, ప్రాంతం గృహిణి, కులం ముదిరాజ్, గ్రామం స్వగృహ కాలనీ, కోహెడ, తన మూడవ కుమారుడు శ్రీశైలం ఇంటి నుండి స్వగృహ లేఅవుట్ లోని తన రెండవ కుమారుడు యాదగిరి నివాసానికి నడుచుకుంటూ వెళుతోంది. మార్గమధ్యలో బైక్ పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను సమీపించి ఇబ్రహీంపట్నంకు దారి అడిగారు. సంభాషణ సమయంలో వారు ఆమె మెడ నుండి దాదాపు 1.5 తులాల బరువున్న బంగారు "పూసల తడ్డ" గొలుసును లాక్కొని అక్కడి నుండి పారిపోయారు.

## వెంచర్ల అభివృద్ధి పేరిట గీత కార్మికుల పొట్ట కొట్టొద్దు

- మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్



**జయభేరి, ఘట్కేసర్ :**

వెంచర్ల అభివృద్ధి పేరిట తాటి చెట్లను కూల్చివేసి గీత కార్మికుల పొట్ట కొట్టొద్దని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. పోచారం మున్సిపాలిటీ కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 311, 312, 313, 324, 326 పి, 327 పిలో దాదాపు 12 ఎకరాల్లో హెచ్ఎండిఎ లేఔట్ చేస్తున్న నిర్వహకులు కొర్రెముల గీత కార్మిక సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా 85 తాటి చెట్లను తొలగించినందుకు గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు.మంగళవారం దీక్షా శిబిరానికి మద్దతుగా మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. ఎక్సైజ్ శాఖ నుంచి అనుమతితో పాటు జిల్లా కలెక్టర్ నుంచి ఎన్ఓసి తీసుకున్నప్పటికీ గీత కార్మిక సంఘం తీర్మానం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. తాటి చెట్లను తొలగించేందుకు ఒక్కో చెట్టుకు దాదాపు రూ.897 వందల చొప్పున 85 చెట్లకు సుమారు రూ. 80 వేలు సంఘానికి చెల్లించడం సరైన పద్ధతి కాదన్నారు. తాతలనాటి నుండి 85 తాటి చెట్లను నమ్ముకొని 300 పైగా కుటుంబాలు జీవనం పొందుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, పల్లె బాబు రావు గౌడ్, దేశం బాలరాజ్ గౌడ్, కుర్ర విగ్నేశ్వర్ గౌడ్, అనిల్ గౌడ్, కట్ట దర్శన గౌడ్, భాస్కర్ గౌడ్, నగేష్ గౌడ్, వెంకట్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్ లు రద్దు చేసే వరకు పోరాటం ఆగదు



**జయభేరి, గజ్వేల్, జూలై 08 :**

జులై 9నజరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలిని ఎఐయుటిసి జిల్లా కౌన్సిల్ సభ్యులు శివలింగు కృష్ణ పిలుపునిచ్చారు అనంతరం గజ్వేల్ లోని సివిల్ సప్లై హమాలి సంఘం కార్మికులతో కలిసి కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడులను వెంబడే రద్దు చేయాలని కోరారు కార్మికులు కొట్లాడితెచ్చుకున్న 44 చట్టాలను రద్దుచేస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగు లేబర్ కోడలు తీసుకరావడం దుర్మార్గమన్నారు ప్రభుత్వ రంగస్థలంలని ప్రైవేటీకరణ ఆపాలని ఆయన కోరారు. ఇట్టి కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలి సంఘం కార్మికులు యాదయ్య, శ్రీనివాస్,ఎల్లం, రాములు,స్వామి,బాలేశు,షారుఖాన్, కరుణాకర్, బీరయ్య,యాదగిరి,ఐలేని, కరుణాకర్,కుమారు. ప్రశాంతు,శ్రీను, ఆంజనేయులుతదితరులు పాల్గొన్నారు.

## అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పుట్టినరోజు వేడుకలు



**జయభేరి, వర్గల్, జూలై 08 :**

సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా చిటుకుల మహిపాల్ రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు.వర్గల్ మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చెట్టిపల్లి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిటుకుల మహిపాల్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఘనంగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు పారుక్ జానీ,సింగం రాజు యాదవ్, భిక్షపతి, సల్మాన్, శ్రవణ్, సాయికుమార్, నందకుమార్, ముకుంద్ రెడ్డి, మాధవ్ రెడ్డి, పిట్ల, రాజు, కృష్ణ, ప్రభుదాస్, సుధాకర్, రాజు, ప్రభాకర్, వెంకట్ తదితరులున్నారు.




## లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో రైతు నేస్తం కార్యక్రమం

జయభేరి, శామీర్ పేట్, జులై 8 :

లాల్ గడి మలక్ పేట్ గ్రామంలోని రైతు వేదిక లో రైతు నేస్తం కార్యక్రమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్ పేట మండల పరిధిలోని పొన్నాల, అద్రాస్ పల్లి, అలియాబాద్, బొమ్మరాశిపేట గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీధర్ రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత వ్యవసాయ సాంకేతికత, పంటల నిర్వహణ, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ వ్యవస్థ వంటి అంశాలపై రైతులకు పలు సలహాలు సూచనలు అందచేశారు. అదే విధంగా పంటల ఎంపిక, సాంకేతిక పరిజ్ఞానం, మద్దతు ధర వంటి అంశాలపై చర్చించారు. ఇక వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. ఇలాంటి కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ జేడీ బాబు, డా. రాజిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి రమేష్, మండల ఉద్యాన శాఖ అధికారి రామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారి సుధీర్, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శామీర్ పేట్ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద భక్తుల పూజలు

- ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన బోగ రవికృష్ణ దంపతులు



జయభేరి, శామీర్ పేట్, జులై 8 :

శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మంగళవారం సందర్భంగా ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.ఇక ఆషాడ మాసం పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. అదేవిదంగా ఆలయం వద్ద కరీంనగర్ కు చెందిన బోగ రవికృష్ణ, వీణ దంపతులు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయానికి విచ్చేసిన భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు.


## జాతీయ రహదారిపై భారీ ఎత్తున ధర్నా రాస్తారోకో



జయభేరి, డిండి :

డిండి మండల కేంద్రంలో కరెంటు సమస్య పరిష్కారానికై జాతీయ రహదారిపై డిండి గ్రామ యువకులు ప్రజలు భారీ ఎత్తున ధర్నా రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కావడం జరిగింది రాస్తారోకో సందర్భంగా విద్యుత్ ఏఈ మరియు అధికారులు విచ్చేసి ఆదివారం లోపు సమస్య పరిష్కారం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఆందోళనకారులు ఆదివారం వరకు సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ ఉద్యమ కార్యచరణ రూపొందించి డిండి బంద్ కు పిలుపునిచ్చి సోమవారం రోజు తీవ్ర ఆందోళన చేస్తామని అధికారుల ను హెచ్చరించారు ఈ సందర్భంగా స్థానిక ఎస్సై రాజు ఆందోళనకారులను పక్కకు జరిపి రహదారిని క్లియర్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిండి గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున యువకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబానికి బియ్యం అందజేత



జయభేరి, తుర్కపల్లి, జూలై 08 :

తుర్కపల్లి మండల కేంద్రానికి చెందిన పుట్ట ఐలయ్య, తలారి ఎల్లమ్మ లు ఇటీవల మరణించడంతో ఈ రెండు కుటుంబాలకు చెరో 50 కిలోల బియ్యాన్ని కాంగ్రెస్ మాజీ మండల పార్టీ అధ్యక్షురాలు బోరెడ్డి జ్యోతి అయోధ్య రెడ్డి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కోట సురేష్, బోయిని మహిపాల్, కూరేళ్ల బాలకృష్ణ, బండారి శ్రీను ,నాగపురి రాంబాబు, పాల్గొన్నారు.

# పాటల పల్లకి నీ విజయవంతం చేసి ఉద్యోగాలు సాదిద్దాం

- తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక
- రాష్ట్ర కార్యదర్శి బండకాడి గణేష్

జయభేరి, గజ్వేల్, జూలై 08 :



తెలంగాణ ఉద్యమంలో గోసి, గొంగడేసి ఆడి పాడి ఆంధ్ర వలస వాదుల పెత్తందారీ వ్యవస్థను ప్రతి ఒక్కరికి తెలిసేలా పాటలతో ఉద్యమాన్ని ఉధృతం చేసిన కళాకారులు నేడు దుర్భరస్థితిలో ఉన్నారు గత ప్రభుత్వం ఉద్యమ కళాకారులను ఆదుకుంటామని సాంస్కృతిక సారధిలో 550 మందికి ఉద్యోగాలు ఇచ్చినప్పటికీ అర్హులైన ఉద్యమ కళాకారులకు అన్యాయం జరిగింది అందరికీ తెలుసు.

అలాగే ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం లోనైనా ఉద్యమ కళాకారులకు న్యాయం జరుగుతుందని ఆశతో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఉమ్మడి పది జిల్లాల్లో పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న ఉద్యమ కవి గాయకులు నేర్నాల కిషోర్ అన్న ఆధ్వర్యం లో ఈనెల 13న మెదక్ జిల్లాలోని టి ఎన్జీవో భవన్లో ఏర్పాటు పాటల పల్లకిలో 12 గంటలు కార్యక్రమం జరుగుతుందని దానికి సంబంధించిన పోస్టర్ ను గజ్వేల్ ప్రెస్ క్లబ్ లో స్థానిక కళాకారులతో కలిసి ఆవిష్కరించడం జరిగింది.

తను మాట్లాడుతూ... ఉమ్మడి మెదక్ లో జరిగే పాటల పల్లకి లో 12 గంటలు కార్యక్రమానికి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు , అధికారులు అనధికారులు తెలంగాణ ఉద్యమ కవులు కళాకారుల పాల్గొనే ఈ సభ లో కళాకారుల జీవితం ఎలా ఉన్నది గోస, బాధలు ఆట, పాటల ద్వారా ప్రభుత్వానికి తెలిజేస్తూ తప్పకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని సాంస్కృతిక సారధిలో ఉద్యోగాలు ఇవ్వాలని చేసే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి మన గజ్వేల్ నియోజకవర్గం నుంచి కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.

కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి సోము నరేష్, ఉపాధ్యక్షుడు సిరియాల్, డప్పు ప్రశాంత్,అక్కారం ఎల్లం, గణేష్, కనకరాజు, మల్లేష్ ,రమేష్ ,ప్రవీణ్ లు పాల్గొన్నారు.

# ల్యాండ్ పూలింగ్ ద్వారా అర్థిక ప్రగతికి మార్గం సుగమం

- బోడుప్పల్ దళిత కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి నిర్ణయం
- ముఖ్యమంత్రి కార్యాలయం నుండి కలెక్టర్ కు ఉత్తర్వులు జారీ
- ఫలించిన వజ్రేష్ యాదవ్ వ్యూహం



జయభేరి, మేడిపల్లి :


ఎండ్ల తరబడి నిరీక్షిస్తున్న బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని 60 దళితుల కుటుంబాల్లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నిర్ణయంతో వెలుగులు నిండాయి. బోడుప్పల్ సర్వే నెంబరు 63/2 నుండి 63/25 లోని 336 ఎకరలా భూమి నాడు సాగు చేసుకుని జీవనం సాధించేందుకు నాడు ఇందిరమ్మ భూమి పంపిణీ చేశారు. నేడు కాలం మారింది గ్రామం నగరంగా రూపాంతరం చెందింది. వ్యవసాయం చేసే వీలు లేదు కావునా సదు దళితుల భూమి ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ ద్వారా ఎకరానికి 600 గజాల చొప్పున ఇచ్చేలా సర్కారు చెప్పడంతో అ రైతులు స్వచ్ఛందంగా ఒప్పుకున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన ద్వారానే మా రైతుల కుటుంబాలు అర్థిక ప్రగతి సాధిస్తాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయంలో మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ చేసిన కృషి మరువలేనిదని ఆయనను కొనియాడారు. మంగళవారం నాడు భూ యజమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మరో పదిహేను రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన అదేశాల మేరకు ప్రతి రైతకు భూ యాజమాన్యం హక్కులకు సంబంధించిన పత్రాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షులు మహేష్ గౌడ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బీ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు రాపోలు ఉపేందర్, మాజీకార్పొరేటర్ చీరల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చీరాల జంగయ్య, దానగళ్ల యాదగిరి, రాపోలు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లలో దోపిడికి పాల్పడితే ఉపేక్షించేది లేదు

- ఆర్థిక ఇబ్బందులతో ఎవరు వైద్యసేవలు కోల్పోకూడదన్నదే మా ప్రజా ప్రభుత్వ ధ్యేయం.
- ప్రజల సంక్షేమాన్ని ముందుపెట్టి ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజల వద్దకు తీసుకెళ్తున్నా
- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

జయభేరి, దేవరకొండ :



దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వ్యవసాయ మార్కెట్ యార్డులో దేవరకొండ నియోజకవర్గంలోని పలు మండలానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరు అయిన 427మంది లబ్ధిదారులకు 1,71,39,000.00 రూపాయల విలువ గల చెక్కులు మరియు ప్రభుత్వ నుంచి మంజూరు అయిన కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు స్వయంగా పంపిణీ చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సామాజికంగా,ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపశమనం కలిగిస్తోంది అని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వైద్య ఖర్చులు భారంగా మారిన వేళ, ఈ సహాయం ఎంతో అవసరమవుతోంది.దేవరకొండ నియోజకవర్గంలో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యాన్ని కోల్పోకూడదన్నదే నా లక్ష్యం అని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ సహాయం మా కుటుంబానికి పెద్ద ఊరట. వైద్యానికి అవసరమైన నిధులు లేక అవస్థలు పడుతున్న వేళ ప్రభుత్వం ఇచ్చిన ఈ సాయం మరపురాని మేలు అని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం దేవరకొండ నియోజకవర్గ ప్రజలపై ఎమ్మెల్యే బాలు నాయక్ కి ఉన్న అనురాగాన్ని, సేవాభావాన్ని మరోసారి ప్రతిబింబించింది అని అన్నారు. పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తూ... సబ్బండ వర్గాల ప్రజలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. మహిళల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం పెండ్లిపాకల రిజర్వాయర్ ముంపు (పత్య తండా) రైతులకు ప్రభుత్వం నుంచి మంజూరు అయిన 30మందికి నష్టపరిహారం చెక్కులను అందజేయడం జరిగింది. భూ నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ కోఆప్షన్ సభ్యులు, NSUI నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మండల అధికారులు, గ్రామ స్థాయి నాయకులు, సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





## విద్యావ్యవస్థలో అవినీతి పర్వం

జయభేరి, దేవరకొండ :

విద్యా వ్యవస్థలో అవినీతి పర్వం – దేవరకొండ నియోజకవర్గం పాఠశాలల్లో విచారణ జరిపించాలి. బాధ్యతలేర్చని ఉపాధ్యాయులు – మౌనంగా ఉన్న విద్యా శాఖ అధికారులు గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేతావత్ బాబురామ్ నాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు ఆయన మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పూర్తిగా క్షీణిస్తున్న దృశ్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండగా, వాస్తవానికి విరుద్ధంగా పెద్ద సంఖ్యలో హాజరు నమోదు చేయడం, మధ్యాహ్న భోజనం, బిల్లు ఖర్చులు, నిధుల వినియోగం వంటి అంశాలలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయి. ఉపాధ్యాయులు పాఠశాలకు హాజరుకాకపోవడం, విద్య బోధనలో నిర్లక్ష్యం వహించడం, పాఠశాల వాతావరణాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయడం వంటి ఘటనలు జిల్లాలో అనేక చోట్ల వెలుగుచూస్తున్నాయి. ముఖ్యంగా విద్యా శాఖ అధికారులు అయిన డీఈఓ, ఎంఈఓలు ప్రజల ఫిర్యాదులను పట్టించుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వల్ల ఈ పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. పాఠశాలలు విద్యా గదులుగా కాకుండా, నిధుల దుర్వినియోగ కేంద్రాలుగా మారుతున్నాయి. బడిపంతులు విధులు విస్మరిస్తూ, స్కూల్లో అసలు బోధనే జరగని పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులు, స్థానికులు చేసే ఫిర్యాదులు అధికారుల టేబుళ్లపై పడి నిశ్చలంగా మిగులుతున్నాయి. ఈ పరిస్థితులపై నేను గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా, విద్యార్థుల రాజకీయ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాను. బడిపంతుల నిర్లక్ష్యం విద్యార్థుల జీవితాలను చిద్రముచేస్తోంది. ప్రభుత్వం విద్యపై ఖర్చు చేస్తున్న నిధులు అవినీతికి గురవుతున్నాయి. ప్రజలు ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కోల్పోతున్నారు. ఇది వ్యవస్థా వైఫల్యం – తక్షణ చర్యలు తీసుకోకపోతే విద్యార్థుల భవిష్యత్తే పతనమవుతుంది. ఆయనకు అన్నారు. అదేవిధంగా మా ముఖ్య డిమాండ్లు.. దేవరకొండ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తనిఖీలు జరపాలి. స్కూల్ హాజరు పట్టికలు, విద్యార్థుల లెక్కలు, బిల్లు ఖర్చులపై ప్రత్యేక ఆడిట్ చేయాలి. హాజరు లేకుండా జీతాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఎంఈఓ, డీఈఓ స్థాయి అధికారులపై విపుల విచారణ జరిపించాలి. గ్రామీణ పాఠశాలల్లో విద్యా హక్కులను రక్షించేందుకు పబ్లిక్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఇది మౌనంగా చూసే పరిస్థితి కాదు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రజలందరిదీ. గిరిజన సంక్షేమ సంఘం, విద్యార్థుల రాజకీయ పార్టీ తరఫున మేం ఈ సమస్యపై ఉద్యమానికి సిద్ధంగా ఉన్నాం. విద్యను వ్యాపారంగా మార్చిన వారిని బహిరంగంగా ఎదుర్కొంటాం అని ఆయన ప్రభుత్వానికి హెచ్చరించారు.

## వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు



జయభేరి, తుర్కపల్లి, జూలై 08 :

తుర్కపల్లి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కోట సురేష్, నాయకులు బోయిని మహిపాల్, కూరేళ్ల బాలకృష్ణ, బండారి శ్రీను పాల్గొన్నారు.

# ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కొత్త సంవత్సరం లోపు ఇందిరమ్మ ఇండ్ల నిర్మించాలి
- 76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధి చర్యలు



**జయభేరి, వేములవాడ :**

వేములవాడ అగ్రహారం వద్ద గల శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్. మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.
మంగళవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి వేములవాడ అగ్రహారం వద్ద గల శ్రీ ఫంక్షన్ హాల్ లో మిడ్ మానేర్ రిజర్వాయర్ ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇల్లు కట్టుకొని ఖాళీ ఫ్లాట్స్ ఉన్నవారికి స్పెషల్ కోటా కింద 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రజా ప్రభుత్వం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్ల మొదటి విడతలో మంజూరు చేశామని, వీటిలో వేములవాడ నియోజకవర్గానికి కేటాయించిన 3500 ఇందిరమ్మ ఇండ్లను ఇప్పటికే పంపిణీ చేశామని, స్పెషల్ కోట కింద మిడ్ మానేరు నిర్వాసిత గ్రామాల ప్రజలకు నేడు 847 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ చేస్తున్నామని, మరో 3 వేల ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు పెండింగ్ విచారణలో ఉన్నాయని, ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, త్వరలో మిగిలిన వారికి తప్పనిసరిగా ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు.
వేములవాడ అర్బన్ ప్రాంతంలోని ముంపు గ్రామాల రిజర్వాయర్ నిర్వాసితులకు తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని అన్నారు. ముంపు గ్రామాల నిర్వాసితుల శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా మనమంతా సంయుక్తంగా పని చేయాలని అన్నారు. భారత దేశంలో ఎక్కడ కూడా పేదలకు ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలు ఖర్చు చేయడం లేదని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం మాత్రమే పెద్ద ఎత్తున పేదలకు నిధులు మంజూరు చేస్తుందని అన్నారు.
76 కోట్లతో వేములవాడ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ఈ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రస్తుతం జరుగుతుందని అన్నారు.
ధనిక రాష్ట్రం తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చి ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారని ప్రభుత్వ విప్ ధ్వజమెత్తారు.
ఆర్థికంగా రాష్ట్రం ఇబ్బందులు పడుతున్నప్పటికీ గత పాలకుల హయంలో ప్రారంభించిన పథకాలను కొనసాగిస్తూనే, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్క హామీ అమలు చేస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల వ్యవధిలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్సు ప్రయాణం పథకాలను ప్రారంభించామని అన్నారు.
వైయస్సార్ జయంతి సందర్భంగా ఆయన హయాంలో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి పథకాలను కొనసాగిస్తూ అదనంగా పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. పేదలు చాలా కాలంగా ఎదురు చూస్తున్న నూతన రేషన్ కార్డుల జారీ చేస్తున్నామని అన్నారు.
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ. స్టేట్ రిజర్వు నుంచి మొట్టమొదటి సారిగా 5 వేల ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితులకు ప్రభుత్వ విప్ ప్రత్యేక చొరవతో మంజూరు చేయడం జరిగిందని అన్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు గజాల లోపు మాత్రమే నిర్మించాలని కలెక్టర్ తెలిపారు. 600 చదరపు గజాల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే చెల్లింపు లలో ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. అమ్మ నాన్న చనిపోయిన కేసులలో పిల్లలకు ఆ ఇల్లు వచ్చేలా చూస్తామని అన్నారు. నేడు 847 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేస్తున్నామని, వీరు కొత్త సంవత్సరం లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాము, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ఇతర ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నాయకులు లబ్ధిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భద్రాచలం ఆలయ ఈవోపై దాడి.. స్పృహ కోల్పోయిన రమాదేవి

**జయభేరి, ఖమ్మం, జూలై 8:**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ భూముల్లోని అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లిన కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి పై కొందరు గ్రామస్థులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఆమె స్పృహ తప్పి పడిపోవడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. వెంటనే స్పందించిన ఆలయ సిబ్బంది ఆమెను భద్రాచలంలోని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.పురుషోత్తపట్నం గ్రామంలో భద్రాద్రి రామాలయానికి చెందిన సుమారు 889.50 ఎకరాల భూమి ఉంది. ఈ భూములను దేవస్థానానికి అప్పగించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అయితే, కొందరు వ్యక్తులు కోర్టు ఉత్తర్వులను ఖాతరు చేయకుండా ఆ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు.సమాచారం అందుకున్న ఈవో రమాదేవి, ఇతర ఆలయ సిబ్బందితో కలిసి మంగళవారం ఆ ప్రాంతానికి చేరుకుని నిర్మాణాలను అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే ఆక్రమణదారులకు, ఆలయ సిబ్బందికి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ తోపులాటలోనే ఈవో రమాదేవిపై దాడి జరిగింది. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఆలయ భూముల పరిరక్షణకు వెళ్లిన మహిళా అధికారిపై దాడి జరగడంపై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## మహిళా లోకాన్ని కించపరిచేలా ప్రసన్న కుమార్ రెడ్డి వ్యాఖ్యలు

- మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ రాయపాటి



**జయభేరి, విజయవాడ:**

వైసీపీ నేత, మాజీ శాసనసభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి, మహిళా శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై చేసిన అసభ్యకర వ్యాఖ్యలను రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ శైలజ రాయపాటి ఖండించారు. ఆయన మాటలు మహిళా లోకాన్ని కించపరిచేలా, సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయి. ఒక ప్రజాప్రతినిధి అయ్యి ఉండి మహిళలను అవమానించేలా, వారి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా మాట్లాడటం హేయం. మహిళలను చులకనగా చూడటం, నీచమైన వ్యాఖ్యలు చేయడం వంటివి మహిళల గౌరవాన్ని దెబ్బతీసే కుట్రగా పరిగణించాలి. రాష్ట్రంలో మహిళల గౌరవానికి భంగం కలిగించే వారు ఎంతటి వ్యక్తులైనా, ఉపేక్షించే ప్రసక్తే లేదు. ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోంది. విచారించి చట్ట పరమైనచర్యలు తీసుకుంటామని అన్నారు.



## యాదాద్రి అంజనేయస్వామికి అభిషేకం, ఆకు పూజ

**జయభేరి, యాదగిరిగుట్ట:**

తెలంగాణ పవిత్ర పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వారి క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామికి మంగళవారం సందర్భంగా అభిషేకం ఆకు పూజ నిర్వహించారు. యాదగిరిగుట్ట.. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో మంగళవారం రోజు క్షేత్ర పాలకుడైన శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విష్ణు పుష్కరిణి ఆవరణలో గల ఆంజనేయ స్వామికి అర్చక బృందం వారు మన్య సూక్త పారాయణముతో అభిషేకం నిర్వహించారు. సింధూరంతో అలంకరించిన స్వామివారికి వివిధ రకాల సుగంధం వెదజల్లే ద్రవ్యాల పూలమాలలతో అలంకరించి నాగవల్లి దలార్చన నిర్వహించారు. ఇట్టి ఆకు పూజలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు..

## భువనగిరిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



**జయభేరి, యాదాద్రి:**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణంలోని 700 సర్వే నెంబర్లలో నిరుపేదలు గుడిసెలు వేసుకున్నారు. ప్రభుత్వం ఇంతవరకు స్థలాన్ని కేటాయించకపోవడంతో నిరుపేద మహిళలు నిరసన వ్యక్తం చేసారు. పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం చేస్తామని సిపిఎం పార్టీ నాయకులు అన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా ఉన్నప్పుడు బోనగిరి సబ్ డివిజన్లో భూపోరాటం సిపిఎం పార్టీ చేయడం కారణంగా 2005లో 700 మంది పైగా లబ్ధిదారులకు బోనగిరి పట్టణంలోని కొన్ని సర్వే నెంబర్లలో ఇళ్ల స్థలాలను కేటాయించడం జరిగింది. 105 మందికి 700 సర్వే నెంబర్లు పట్టా స్థలాలను ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు అప్పటినుండి ఇప్పటివరకు ఇండ్ల స్థలాలను చూపించకపోవడంతో నిరుపేదలందరూ కలిసి మూడు రోజుల ఇక్కడ గుడిసెలు వేస్తున్నారు దీంతో అధికారులు సమాచారం తెలుసుకొని స్థానిక ఎంఆర్ఓ ఆధ్వర్యంలో సంఘటన స్థలానికి చేరుకొని తీసివేయడం జరుగుతుంది నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వెంటనే కేటాయించాలని వారికి స్థలాలు చూపించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**జయభేరి, కరీంనగర్:**



అన్ని సౌకర్యాలతో కూడిన ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతోందని, ప్రైవేట్ పాఠశాలల నుండి 35 మంది విద్యార్థులు లింగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో చేరడం ఇందుకు నిదర్శనమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూరు మండలం లింగాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమావేశానికి పేరెంట్స్ కచ్చితంగా హాజరు కావాలని అన్నారు. అప్పుడే పిల్లల చదువు తీరును తెలుసుకోవచ్చని, ఉపాధ్యాయులతో మాట్లాడి మరింత మెరుగుపరచవచ్చని అన్నారు. ఐదవ తరగతి లోపు విద్యార్థుల పట్ల అత్యంత శ్రద్ధ అవసరమని, ప్రభుత్వ పాఠశాలలో ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లింగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలకు వివిధ ప్రైవేటు పాఠశాలల నుండి 35 మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో చేరడం గొప్ప విషయం అన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ గ్రామంలో ఐదేళ్లు నిండిన అంగన్వాడి చిన్నారులు మొత్తం మంది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరడం, ఏడవ తరగతి పూర్తి చేసిన నూరు శాతం విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చేరడం పట్ల కలెక్టర్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేసే వాట్సాప్ గ్రూపులు, యూట్యూబ్ ఛానల్ ద్వారా తల్లిదండ్రులు ప్రభుత్వ విద్యా విధానాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. రెండవ తరగతి విద్యార్థినిని ఒడిలో కూర్చుండబెట్టుకొని న్యూస్ పేపర్ చదివించారు. పలువురు విద్యార్థులు ప్రయోగాత్మకంగా నేర్చుకున్న అంశాలను కలెక్టర్ కు వివరించారు. అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో తీసుకున్న చర్యల పట్ల అభినందించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఎంఈఓ మధుసూదన్, తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీవో వరలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ జియ్యంగార్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.
ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన:
మానకొండూరు మండలం లింగపూర్ లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. లబ్ధిదారు తాళ్ల భాగ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి నిర్మాణంలో ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నిర్మాణం వేగంగా పూర్తి చేసుకోవాలని, దశలవారీగా సొమ్ము జమ చేయిస్తామని అన్నారు. లబ్ధిదారు ఇల్లు బేస్మెంట్ లెవెల్ పూర్తవుతున్నందున లక్ష రూపాయలు జమ చేసేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరలక్ష్మి, తహసిల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారం చేస్తే...

- మంత్రి సీతక్క

**జయభేరి, ములుగు:**

తప్పుడు ప్రచారం చేస్తే నాశనమైపోతావు కేటీఆర్ అంటూ ఫైర్ మంత్రి సీతక్క అయ్యారు. చిల్లర రాజకీయాలు మానండి నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వివరించండి. కేటీఆర్ మీ చెల్లి నీ మీద దుమ్మెత్తి పోస్తుంది.. ఆమె సంగతి ఏందో చూడు . నాతో పెట్టుకుంటే నీకు వచ్చేది ఏం లేదు. నీలాగా కుల బలము తన బలము అహంకార బలము నా వద్ద లేదు. నాకెవరూ లేరు. ఉన్న అన్న కూడా ఉద్యమంలో చనిపోయాడు. నాకు నియోజకవర్గమే నాకు అండ. ములుగు ప్రజలు దీవిస్తే మంత్రిని అయ్యానని అన్నారు. నువ్వు నిర్వహించిన పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు నేను మంత్రయితే కేటీఆర్ తట్టుకోవట్లేదు. అభివృద్ధికి అందరూ సహకరించండి. అబద్ధపు ప్రచారంతో కేటీఆర్ నాశనమైపోతాడు. ఇంట్లో ఆడబిడ్డను నువ్వు కుట్రలు కుతంత్రాలతో వేధిస్తున్నావు. ములుగులో ఇందిరమ్మ పాలన ప్రజాస్వామ్య పాలన సాఫీగా సాగుతోంది . ఇబ్బందులు నిర్బంధాలు లేవు . నా మీద ఉన్న అభిమానాన్ని, ములుగు అభివృద్ధిని అడ్డుకునేందుకు కేటీఆర్ కుట్రలు చేస్తున్నారు



. పక్క నియోజకవర్గాలలో చిత్తుగా ఓడిపోయి అక్కడ ఎవరు పట్టించుకోక ఇక్కడికి వచ్చి డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్ నిజంగా మనిషి అయితే పోలీసు రాజ్యం ములుగులో ఉందని నిరూపిస్తావా? మీ హాయంలో మా కార్యకర్తల మీద ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేశారు . లక్ష్మీదేవి పేట, చల్వాయి తో పాటు ఎన్నో గ్రామాల యువకుల మీద మీరు కేసులు పెట్టి వేధించారు..చర్చకు సిద్ధమా? ములుగు లో శాంతియుత వాతావరణం ఉంది ప్రజాస్వామ్య పాలన కొనసాగుతోందని అన్నారు. దొర దురంకారంతో కుట్రలను రాష్ట్ర ప్రజలు ములుగు ప్రజలు అర్థం చేసుకున్నారు. మీరు శాంతియుత ధర్నా చేసుకుంటామని చెప్పి మంత్రుల కాన్వాయ్ ని అడ్డుకునే ప్రయత్నం ఎందుకు చేశారు . మీకు రాజకీయ డ్రామాలు తప్ప.. బాధిత కుటుంబాలను ఆదుకునే సోయి లేదని అన్నారు.
ములుగు నియోజకవర్గంలో 90% ఎస్సీ, ఎస్టీ, బీసీ పోలీస్ అధికారులు ఉన్నారు. వారి మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా మీరు ఆరోపణలు చేస్తున్నారు. మీ హయంలో ములుగు నియోజకవర్గంలో మీ మంత్రులు పర్యటిస్తే విపక్ష నేతలను హౌస్ అరెస్టులు చేసేవారు . తాగడానికి కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదు మీరు. చల్వాయిలో రమేష్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకుంటే.. మమ్మల్ని నిందించడానికి బుద్ధి ఉండాలి. ఆ కుటుంబాన్నీ పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చామని అన్నారు. మీరు ప్రజలను పొట్టన పెట్టుకుంటే.. మేము కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం. మీ పాలనలో టిఆర్ఎస్ నేతల వేధింపులకు ఎందరో బలయ్యారు. సూసైడ్ లేఖలు, సెల్ఫీ వీడియోలు తీసుకొని ఆత్మహత్యలు చేసుకున్నారు.

## మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ఘన నివాళ్లు

- ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, పలువురు నేతలు



**జయభేరి, హైదరాబాద్:**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76 వ జయంతి సందర్భంగా పంజాగుట్ట చౌరస్తా లో వైఎస్ ఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీ బలమురి వెంకట్ , సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, కాంగ్రెస్ నేతలు కేవీపీ రామచంద్రరావు, అంజన్ కుమార్ యాదవ్, ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 76 వ జయంతి సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పక్షాన ఘన నివాళులు అర్పిస్తున్నాం. ఆయన రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో దేశానికి ఆదర్శంగా నిలిపారు. ఆయన మరణించి 15 సంవత్సరాలు గడిచిన ఇంకా ఆయన గుర్తులు ప్రజల్లో చిరస్మరణీయంగా ఉన్నాయి. వారికి ఘన నివాళులు అర్పిస్తు ఈనాటి యువత వారి శ్రమ, సమయ స్పూర్తి రాజకీయాల్లోకి వచ్చే వారు వారి నుండి నేర్చుకొని ముందుకు పోవాలి.

## నిరుపేద ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య

**జయభేరి, చేవెళ్ల:**

సన్నబియ్యం తీసుకున్న చేవెళ్ల పట్టణ సమీపంలోని ఇబ్రహీంపల్లి కాలనీకి చెందిన లబ్ధిదారుడు జీవనోళ్ల కృష్ణ ఇంట్లో చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య భోజనం చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం ఉండాలనే లక్ష్యంతోనే ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# ఓటమి శాశ్వతం కాదన్న '3BHK'

"3BHK' సినిమాలో భాగం అవ్వడం గర్వంగా ఉంది. ఒక క్లాసిక్ సినిమాకు ఉండాల్సిన క్వాలిటీస్ ఈ సినిమాలో ఉన్నాయి. ఇది ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యే కథ. చూసిన వారంతా బావుందని మెచ్చుకుంటుంటే ఆనందం ఉంది. ఈ సినిమా చూసిన ప్రతి కొడుకు తెరపై తన తండ్రిని చూసుకుంటున్నాడు. ప్రతి తండ్రీ తన కొడుకును చూసుకుంటున్నాడు. ఇందులో నేను పోషించిన ప్రభు పాత్ర చాలా విషయాలు నేర్పింది. ఓటమి అనేది పర్మినెంట్ కాదని ఈ సినిమా ద్వారా దర్శకుడు శ్రీగణేష్ చెప్పాడు. అతని రైటింగ్ అద్భుతం. తెలుగు రాష్ట్రాల్లో ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి స్పందన అద్భుతంగా ఉంది. శరత్‌కుమార్, దేవయాని లేకపోతే ఈ సినిమా లేదు. ప్రతి ఇంట్లో ఉండే తల్లిదండ్రుల్ని వారు కళ్లకు కట్టారు. ఈ సినిమాను విడుదల చేసిన మైత్రీ మూవీమేకర్స్‌కు థ్యాంక్స్ చెబుతున్నా' అని హీరో సిద్ధార్థ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం '3BHK'. శ్రీగణేశ్ దర్శకుడు. శరత్‌కుమార్, దేవయాని, మీతా రఘునాథ్, చైత్ర, యోగిబాబు కీలక పాత్రధారులు. ఇటీవలే సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా థ్యాంక్స్ మీట్‌లో సిద్ధార్థ్ పై విధంగా స్పందించారు.

# అందుకే ట్యాగ్ తీసేయమన్నా!



విజయ్ దేవరకొండ 'కింగ్డమ్' ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకురానుంది. రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్‌తో పాటు విడుదల చేసిన ప్రోమో రోమాంచిత యాక్షన్ ఘట్టాలతో ఆకట్టుకుంది. ఈ సినిమాపై ఇప్పటికే పాజిటివ్ బజ్ నెలకొని ఉండటంతో విజయ్ అభిమానులు హిట్ పక్కా అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌ను మొదలు పెట్టారు విజయ్ దేవరకొండ. తాజాగా ఓ ఆంగ్ల పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ప్రస్తుతం తన పేరు ముందు ఎలాంటి ట్యాగ్ లేదని, 'లైగర్' సమయంలో 'ది విజయ్ దేవరకొండ' అనే ట్యాగ్ పెట్టుకోవడం వల్ల ఎన్నో విమర్శల్ని ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు.

"లైగర్' ప్రమోషన్స్‌లో చిత్రబృందం నా పేరు ముందు 'ది' అనే పదాన్ని జోడించింది. అది చాలా కొత్తగా అనిపించడంతో ఓకే చేశా. ఆ తర్వాత దీనిపై చాలా విమర్శలొచ్చాయి. దాంతో ఆ ట్యాగ్‌ను తీసివేయాలని మా టీంను కోరాను. ఇప్పుడు ఎలాంటి ట్యాగ్ లేకుండా ఉన్న హీరోని నేనే కావొచ్చు. అయినా నాకు బిరుదులతో గుర్తుండిపోవాలని లేదు. ప్రేక్షకులు మంచి నటుడిగా గుర్తుంచుకుంటే చాలు' అని విజయ్ దేవరకొండ పేర్కొన్నారు.


# తమన్నా వన్స్ మోర్..

స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారిపోతున్నారు తమన్నా. ఓవైపు హీరోయిన్‌గా వరస సినిమాలు చేస్తూనే.. మరోవైపు స్పెషల్ సాంగ్స్ కూడా చేస్తూనే ఉన్నారు. పైగా తమన్నా అప్పియరెన్స్ ఈ సినిమాలకు కలిసొస్తుంది కూడా. ముందు సౌత్‌లో రప్ఫాడించిన ఈ బ్యూటీ.. ఇప్పుడు బాలీవుడ్‌లో కుమ్మేస్తున్నారు. అక్కడ ఆమె లక్కీ బ్యూటీ అయిపోయారు కూడా. గతేడాది స్త్రీ 2 కోసం బాలీవుడ్‌లో ఫస్ట్ టైమ్ స్పెషల్ సాంగ్ చేసారు తమన్నా.. అది ఇండస్ట్రీ హిట్ కావడంతో ఈమెకు ఆఫర్స్ క్యూ కడుతున్నాయిప్పుడు. స్త్రీ 2 తర్వాత తమన్నా బాలీవుడ్ కెరీర్‌కు రెక్కలొచ్చాయి. సినిమాల కంటే ఎక్కువగా మా సినిమాలో ఒక్క పాట చేయండి ప్లీజ్ అనే ఆఫర్స్ ఎక్కువైపోయాయి ఈమెకు. రైడ్ 2లోనూ అదిరిపోయే స్పెషల్ సాంగ్ చేసారీమే. తమన్నా స్పెషల్ సాంగ్ అనేది సినిమాలకు స్పెషల్‌గా మారుతుందిప్పుడు. అందుకే ఐటం సాంగ్ అనగానే మరో ఆలోచన లేకుండా తమన్నా పేరు తలుచుకుంటున్నారు మేకర్స్. తాజాగా ప్రభాస్ సినిమాలోనూ తమన్నాకు అదిరిపోయే ఆఫర్ వచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. గతంలో ఈ ఇద్దరూ కలిసి రెబల్, బాహుబలి 1 అండ్ 2 సినిమాలలో నటించారు. ప్రభాస్, మారుతి కాంబినేషన్‌లో వస్తున్న రాజా సాబ్‌లో తమన్నా స్పెషల్ సాంగ్ చేయబోతున్నారనే ప్రచారం జరుగుతుంది. హీరోయిన్‌గా ఈమెకు ఆఫర్స్ పెద్దగా రావట్లేదు గానీ స్పెషల్ సాంగ్స్‌కు మాత్రం కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు మిల్కీ బ్యూటీ. తాజాగా రాజా సాబ్‌తోనూ చిందేయడానికి రెడీ అవుతున్నారు తమన్నా. డిసెంబర్ 5న విడుదల కానుంది రాజా సాబ్.




బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ధురంధర్'. ఈ సినిమాకు నేషనల్ అవార్డు విన్నర్ ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్నాడు. 'ఉరి: ది సర్జికల్ స్ట్రైక్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఆదిత్య ధర్ దర్శకత్వం వహిస్తున్న రెండవ చిత్రం ఇది. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. రణ్‌వీర్ సింగ్ ఇందులో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించబోతున్నట్లు తెలుస్తుంది. ఇంతకీ ఆ అమ్మాయి ఎవరో కాదు. విక్రమ్ నటించిన నాన్న సినిమాతో బాల నటిగా అందరిని మెప్పించిన నటి సారా అర్జున్. అవును సారా అర్జున్ 'ధురంధర్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తుంది. మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన పొన్నియన్ సెల్వన్ చిత్రంలో జూనియర్ ఐశ్వర్య రాయ్ పాత్ర (నందిని)లో మెరిసింది. ఉన్నది కొద్దిసేపే అయిన తన నటనతో ఆకట్టుకుంది. అయితే చాలా రోజుల తర్వాత ఈ అమ్మడు బాలీవుడ్‌లో ట్రెండింగ్‌గా మారింది. ప్రస్తుతం సారా అర్జున్ ఎవరని బాలీవుడ్ మీడియాతో పాటు అభిమానులు తెగ సెర్చ్ చేస్తున్నారు. దీనికి కారణం రణ్‌వీర్ సింగ్ సినిమాలో సారా అర్జున్ హీరోయిన్‌గా నటించడమే. మరోవైపు ఈ సినిమా వలన సారాకి మరిన్ని ఆఫర్లు వచ్చేలా ఉన్నాయి. పాపులర్ బాలీవుడ్ యాక్టర్ రాజ్ అర్జున్ కూతురే ఈ సారా. తెలుగులో రాజేంద్రప్రసాద్ ప్రధాన పాత్రలో నటించిన దాగుడు మూత దండాకోర్ చిత్రంలో కూడా నటించింది ఈ భామ.

# రణ్‌వీర్ సింగ్ హీరోయిన్..



# 'వార్ 2' షూటింగ్ కంప్లీట్.. హృతిక్ రోషన్ ఎమోషనల్ పోస్ట్




వార్ 2 సినిమా షూటింగ్ పూర్తయిన సందర్భంగా బాలీవుడ్ స్టార్ హృతిక్ రోషన్ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 149 రోజుల పాటు సాగిన ఈ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, సినిమా కోసం పడిన కష్టాన్ని, చెమటను, గాయాలను గుర్తుచేసుకున్నారు.

వార్ 2 షూటింగ్ కంప్లీట్ అయిన నాకు ఏదో తెలియని భావన కలిగింది. 149 రోజుల విరామం లేని పోరాటం, యాక్షన్, డ్యాన్స్, రక్తం, చెమట, గాయాలు... ఇదంతా విలువైనదే! తారక్ సర్, మీతో కలిసి పనిచేయడం, మీతో కలిసి ఇంత ప్రత్యేకమైన చిత్రాన్ని రూపొందించడం చాలా గొప్ప గౌరవం. అద్వానీ కియారా, మీలోని ఆ డేంజరస్ సైడ్ చూసేందుకు ప్రపంచం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. మీతో స్క్రీన్ షేర్ చేసుకోవడం అద్భుతంగా ఉంది. ఆది, అయాన్ల అద్భుతమైన సినిమాటిక్ విజన్‌ని మీరంతా చూసేందుకు నేను వేచి ఉండలేను. వార్ 2 టీమ్‌కు, నటీనటులకు, సిబ్బందికి.. మీ టాలెంట్‌ని పంచుకున్నందుకు, ప్రతిరోజు మీ శాయశక్తులా కృషి చేసినందుకు ధన్యవాదాలు.

చివరగా.. కబీర్ పాత్రకు గుడ్ బై చెప్పడం ఎప్పుడూ కాస్త బాధగానే ఉంటుంది. మళ్లీ నార్మల్ అవ్వడానికి నాకు కొన్ని రోజులు పడుతుంది. ఆగస్టు 14, 2025న వార్ 2 సినిమాను మీ ముందుకు తీసుకురాబోతున్నామంటూ హృతిక్ వెల్లడించారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. **Cell: 9391 544 889. RNI No: TGTEL/25/A0314**. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com